# పతీ సహగమనం

మాధవయ్య అదురుతూన్న గుండెతో, ఆందోళనతో రిక్షా దిగాడు. ఆ ఇంటిముందు జనాన్ని, ఆగి ఉన్న పోలీసు జీపును చూసి ఆయనకు దు:ఖం మరింత ఎగదన్నుకువచ్చింది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగి చెంపల మీదకు ఉబికి వచ్చాయి.

వణుకుతున్న కాళ్ళతో జనాన్ని తప్పించుకుంటూ ఇంటి మెట్లెక్కాడు. వరండాలోకి అడుగు పెట్టాడు. అక్కడ దృశ్యం ఆయన హృదయాన్ని కలచివేసింది. వృద్ధ శరీరం తట్టుకోలేనట్టుగా గోడకు చేరగిల పడిపోయింది. కండువా నోటి కడ్డంగా పెట్టుకుని చిన్న పిల్లాడిలా అతను వెక్కి వెక్కి ఏడవసాగాడు.

" వసుంధరమ్మ తండ్రి, పాపం! ఈ వయస్సులో ఎంత కష్టం వచ్చిపడిందో!"

ఇద్దరి కిద్దరూ ఎంత ఒద్దికగా ఉండేవారని. ఇంట్లోంచి ఒక్క మాటకూడా వినబడేది కాదు." జనం గుసగుసలు... గోల.

అక్కడ వరండాలో ఒకరి పక్కన ఒకరు ఆదమరచి నిద్రపోతున్నట్లు వసుంధర, ఆమె భర్త బాబూరావు, ఆ దంపతుల చుట్టూ నలుగురు పోలీసులు. అదే ఇంటి మరో పోర్షనులోని మనుషుల్ని వివరాలడుగుతూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూన్న సబిన్‌స్పెక్టరు.

ఎందుకిలా జరిగింది? పెళ్ళయి రెండు వసంతాలు నిండకమునుపే తన కూతురికి, అల్లుడికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అగత్యం ఎందుకొచ్చింది? ఏ పరిస్థితులు ఇంతటి దారుణానికి పురికొల్పాయి? ఏ సమస్యలు వాళ్ళ జీవితాల్ని అంతం చేసుకొమ్మని ముందుకు తోశాయి? తనతో మాట మాత్రం చెప్పకుండా, ఏ విషయం తెలియనివ్వకుండా... ఈ వయసులో,వృద్ధాప్యంలో తన కెందు కింత బాధని రంపపుకోతని మిగిల్చిపోయారు?

మాధవయ్య ఆలోచించలేకపోతున్నాడు. ఆలోచించలేక పెల్లుబికే దు:ఖంతో ఆవేదనతో, గోడుగోడున విలపిస్తున్నాడు.

పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్, మాధవయ్య దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేశాడు. వివరాలడుగుతూ ఏవో ప్రశ్నలు వేశాడు. మాధవయ్యకు అతని ప్రశ్నలేమీ వినిపించలేదు. వినిపించినా అతను సమాధానం చెప్పే స్థితిలో లేడు. ఉప్పెనలా ఉబికి వస్తోన్న దు:ఖం చివరిసారిగా "నా కేమీ తెలియదు. బాబూ! ఎందు కిలా జరిగిందో!" బొంగురు పోయిన గొంతుతో బావురమన్నాడు మాధవయ్య.

" మీ రొకసారి స్టేషనుకు, రండి!" ఇన్ స్పెక్టరు ఇంటి మెట్లు దిగాడు.

వసుంధర, బాబూరావుల శవాల్ని జీపులోకి ఎక్కించారు పోలీసులు. జీపు ముందుకు దూసుకుపోయింది. మాధవయ్య క్రుంగిపోతూ అల్లుడూ, కూతురు లేని ఆ ఇంట్లోకి అడుగు పెట్టాడు. తన ఎదురుగా టేబిలు మీద వాళ్ళ పెళ్ళి ఫోటో వెక్కిరిస్తూ కనిపించింది. మాధవయ్య వణుకుతూ ఆ పెళ్ళి ఫోటోను చేతుల్లోకి తీసుకున్నాడు. ఆయన మస్తిష్కంలో రెండేళ్ళు వెనక్కిపోయి గతాన్ని కెలికింది.

"నాన్నా! కాఫీ తీసుకోండి."

అరుగుమీద పదిమంది కుర్రాళ్ళ మధ్య తనో కుర్రాడిలా కూర్చుని అరుస్తూ పాఠాలు చెబుతూన్న మాధవయ్య మాస్టారు తలెత్తి చూశారు. ఎదురుగా వసుంధర! తన ముద్దుల తనయ! అప్పుడే అభ్యంగన స్నానం చేసి, ఇంకా తడి ఆరని కురుల్ని పొడిగుడ్డతో ముడివేసుకుని పసిడివర్ణం పట్టుపరికిణీ జాకెట్టులో, ముదురు నీలం వల్లెవాటులో, నుదుట ఎర్రగా మెరుస్తూన్న తిలకం బొట్టుతో కడిగిన ముత్యంలా కళకళ లాడుతోంది.

" ఎందుకమ్మా మళ్ళీ కాఫీ! గంట క్రితమేగా తాగింది!?

వాత్సల్యం నిండిన కళ్ళతో కూతుర్ని రెప్పవేయకుండా చూసుకుంటూ అన్నాడు. మాధవయ్య.

"పొద్దుటనుంచి గొంతు చించుకుని ఒకటే అరుస్తున్నాడు. మీ కసలే నీరసం. ఫరవాలేదు.... తీసుకోండి." తండ్రి చేతిలో కాఫీ ఉంచి లోపలికి వెళ్ళిపోయింది వసుంధర.

" నువ్వే మరో ఇంటికి పోతే నన్ను పట్టించుకునే వారెవ్వరు. తల్లీ! అయినా ఇప్పట్లో నిన్ను మరో ఇంటికి పంపగలిగే స్థితిలో ఎలాగూ లేనమ్మా" వేడి వేడి కాఫీ తాగుతూ మనసులో సణుక్కున్నాడు మాధవయ్య.

మాధవయ్య రిటైరయి మూడేళ్ళయ్యింది. ఇద్దరుకొడుకులు మంచి ఉద్యోగాల్లో చెరో రాష్ట్రంలోనూ స్థిరపడిపోయారు. వాళ్ళకు సంవత్సరానికొక్కసారైనా రావడానికి వీలుపడదు. నెల కో ఉత్తరం రాయడానికన్నా వెసులుబాటు చిక్కదు. ఏమంటే బాధ్యతలు.. . తీరికలేని జీవితం... ఇద్దరిలోనూ ఏ ఒక్కరికీ చెల్లెలి బాధ్యత నెత్తిమీద వేసుకోవడానికి ఇష్టంలేదు... అనడం కంటే వాళ్ళ భార్యలు గీసిన గీటు దాటరనడం సబబు. వసుంధర ఈడేరి అప్పుడే అయిదేళ్ళయింది. కూతురికి పెళ్ళి చేయలేకపోతున్నాననే బెంగ మాధవయ్యకు ఎక్కువయింది. కొడుకులకు ఉత్తరాలు రాస్తే జవాబు శూన్యం! ఎప్పుడైనా జవాబొచ్చినా ఆర్థిక ఇబ్బందులు పాట్లు... చెల్లెలు పెళ్ళికి తొందరేం వచ్చిందంటూ కప్పదాట్లు, అలాంటి నిర్భాగ్యపు స్థితిలో ఒకరోజు ...

" నమస్కారం మాస్టారూ" అరుగుమీద పాఠాలు చెబుతున్న మాధవయ్య తలెత్తి చూశాడు. సన్నగా పొడుగ్గా చామనఛాయలో ఉన్న యువకుడు. పెదాలమీద చెరగని చిరునవ్వు చూడగనే సద్భావం ఉట్టిపడే రూపం. పాతికేళ్ళ వయస్సు ఉండొచ్చు. కుర్రాడు సలక్షణంగా ఉన్నాడు. ఎవరు? ఎక్కడా చూసిన జ్ఞాపకం లేదు.

" నన్ను గుర్తుపట్ట లేదనుకుంటాను, మాస్టారూ! చిన్నప్పుడు మీ దగ్గర నాలుగేళ్ళు చదువుకున్నాను. నా పేరు బాబూరావు. ఈ ఊరు ధర్మాసుపత్రిలో కాంపౌండరుగా నిన్ననే చేరాను. వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త సర్వోత్తమరావుగారు మా మేనమామగారే."

" అలాగా బాబూ! చాలా సంతోషం. రా కూర్చో చాలా కాలమయిందిగా నిన్ను చూసి గుర్తు పట్టలేకపోయాను." మాధవయ్య ఆనందానికి అవధులు లేవు. చేతులు కట్టుకుని వినమ్రంగా చిన్ననాటి కబుర్లు ఎన్నో వర్ణించి చెబుతూన్న బాబూరావును చూసి ఎంతో ముచ్చటేసింది. లోపలికి కేక వేసి కూతుర్ని కాఫీ పెట్టమన్నాడు. కొద్ది నిముషాలకే వసుంధర

కాఫీతో వచ్చింది. తలుపు చాటునించి కాఫీ అందించింది.

బాబూరావు వసుంధరను చూశాడు. వసుంధర లోపలికి వెళ్ళిపోయింది.

" నా బ్రతుక్కి ఆశాదీపం ఇదొక్కతే బాబూ తల్లిలేని పిల్ల. ఈ దీపాన్ని ఎవరో ఒక దేవుడి చేతిలో పెట్టేవరకు నాకు మనశ్శాంతి లేదు." కూతురు పెళ్ళి గురించి బాధపడుతూ తన ఆర్థిక పరిస్థితులన్నీ శిష్యుడి ముందు ఏకరువు పెట్టుకున్నాడు మాధవయ్య.

బాబూరావు మాస్టారికి ధైర్యం నూరిపోశాడు. మాస్టారి అనారోగ్యానికి ఆసుపత్రి నుంచి ఉచితంగా మందులు సరఫరా చేశాడు. శిష్యుడిగా ఎక్కడలేని అభిమానాన్ని, భక్తిశ్రద్ధల్నీ ప్రదర్శించాడు. వసుంధరతోనూ గంటల తరబడి మాట్లాడే చనువునూ స్నేహాన్ని సంపాదించాడు.

" మాస్టారూ! మీకేం అభ్యంతరం లేకపోతే వసుంధరని నేను పెళ్ళి చేసుకుంటాను!" ఊహించని విధంగా ఒక రోజు తన నిర్ణయాన్ని మాస్టారి ముందు పెట్టాడుబాబూరావు. మాధవయ్యకు కొద్ది క్షణాలు మాటలు రాలేదు. ఆయనకు ఒక వైపు చాలా సంతోషంగా ఉంది... మరొకవైపు సంకోచంగా ఉంది.

" బాబూ ! నువ్వు అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానంటే నాకు మాటలు రావటంలేదు. దాని అదృష్టం, సుకృతం ఇంత త్వరగా కలిసివస్తాయని నేను కళ్ళో కూడా అనకోలేదు. నాకు కొడుకులు ఉన్నా లేనట్టే. ఊళ్ళో పెద్దల సాయంతో పెళ్ళి.... నాకు ఉన్నంతలో చేయించగలనేమోగాని,కట్నం రూపేణా ఏమీ ఇవ్వలేను బాబూ" మాధవయ్య కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

" మీ అమ్మాయిని పెద్ద మనసుతో నా కివ్వడానికి అంగీకరిం... మీరు నాకిచ్చే పెద్ద కానుక మరేమి మాట్లాడకండి."

వసుంధర కూడా బాబూరావును పెళ్ళి చేసుకోవడానికి సంతోషం, సుముఖత వ్యక్తపరచడంతో, వారం రోజుల్లోనే వాళ్ళిద్దరి పెళ్ళి నిర్విఘ్నంగా, నిరాడంబరంగా జరిగిపోయింది.

మాస్టారింట్లో కొత్తకాపురం పెట్టాడు బాబూరావు. వసుంధర ఓర్పుగలది. సౌశీల్యం, సహనం ఆమెకు పెట్టని ఆభరణాలు. కలతలు లేవు. కన్నీళ్ళు లేవు. కష్టాలంతకంటే లేవు. రోజులు తియ్యగా.. ఓ సంవత్సరం గడిచిపోయింది.

ఆ ఊళ్ళో ఆసుపత్రిలో తనకు అంతగా గిట్టుబాటు లేదని.... తనకు ఆరోగ్యం అనువుగా ఉండటం లేదని మరింకా ఏవో కారణాలు చెప్పి హఠాత్తుగా మరో ఊరికి బదిలీ చేయించుకున్నాడు. బాబూరావు. మాధవయ్య బాధపడుతూ, బెంగతో అల్లుడికీ, కూతురికీ వీడ్కోలు చెప్పక తప్పలేదు.

వసుంధర ఉత్తరం రాసినా, రాయకపోయినా, నెలకో ఉత్తరం మాధవయ్య తప్పనిసరిగా రాసేవాడు. అల్లుడు క్షేమాన్ని, కూతురు కాపురాన్ని విధిగా పరామర్శించేవాడు... రెండు మూడు ఉత్తరాల కో జవాబు వచ్చేది. ఏ ఉత్తరంలోనూ వాళ్ళసమస్యలు వ్రాయలేదు.

బాధలు కష్టాలు సూచనప్రాయంగానైనా తనకు తెలియనివ్వలేదు.

ఏం జరిగిందో, ఏ దుష్టశక్తి వాళ్ళను అక్కున చేర్చుకుందో, ఇంత దయనీయంగా ఆత్మహత్యకు ఎందుకు పాల్పడవలసివచ్చిందో?

మాధవయ్య చేతుల్లోంచి అల్లుడూ, కూతురు కలిసి ఉన్న పెళ్ళి ఫోటో దబ్‌మని కింద పడింది. అద్దం పగిలి ముక్కలయింది. గతాన్ని కెలికిన ఆలోచనలు చెదిరిపోయాయి.

మాధవయ్య ఆ ఇంట్లో పిచ్చివాడిలా కలయ తిరుగుతున్నాడు. జుట్టు పీక్కుంటున్నాడు. ఆగదిలోంచి ఈ గదిలోకి అడుగులు వేస్తూ కనిపించిన ప్రతి వస్తువును ఆత్రంగా తడిమి తడిమి చూస్తున్నాడు. ఎంత తిరిగినా, ఎలా ఆలోచించినా అల్లుడు, కూతురు అర్థాంతరంగా తమ బ్రతుకుల్ని ఎందుకు అంతం చేసుకున్నారో కారణం అంతుపట్టడంలేదు. ఇరుగుపొరుగు వాళ్ళు ఏమీ చెప్పలేకపోయారు. ఆర్థికమైన బాధలా? ఆంతరంగిక మనస్పర్థలా? సంతానం లేని అసంతృప్తి అగ్ని జ్వాలలా? ఏవిటి?

మాధవయ్య మతి భ్రమించినవాడిలా తిరుగుతున్నాడు.

మధ్య గదిలో పట్టె మంచం మీద పక్క చెదిరిపోయి ఉంది. వాడిన మల్లెపూదండ ఒక వైపు వేలాడుతూ కనిపించింది. చిట్లిన గాజు ముక్కలు అక్కడక్కడా చిందరవందరగా పడి ఉన్నాయి. పోలీసులు అన్నీ వెదికి అస్తవ్యస్తం చేశారేమో రేడియో స్థానభ్రంశం చెంది ఉంది. బీరువా తలుపులు బారుగా తీసి ఉన్నాయి. గోడమీద హేంగరుకు ఉండాల్సిన బట్టలు నేల మీద గుట్టలుగా పడిఉన్నాయి.

మాధవయ్య శోక హృదయంతో ఆ ఇంట్లోని అణువణువూ శోధిస్తున్నాడు.

గోడల నిండా దేవుడి పటాలు, కాలెండర్లు, వసుంధరకు చిన్నప్పటి నుంచి దైవభక్తి ఎక్కువ వంటగదిలోనే ఒక మూలగా పూజ చేసుకునే సరంజామా ఉంది. చెక్క పెట్టెలతో గోపురంలా కట్టుకున్న గుడి అందంగా అలంకరించబడి ఉంది. ఆ గుడిలో సీతారాముల విగ్రహాలు చిరునవ్వులు రువ్వుతున్నాయి. విగ్రహాల క్రిందుగా కనిపించీ కనపడకుండామడత పెట్టిన కాగితాల దొంతర! ఏమిటవి! పోలీసుల కళ్ళబడలేదా!?

అదురుతున్న గుండెతో మాధవయ్య, ఆ విగ్రహాలను పైకి లేపి కాగితాలను చేతిలోకి తీసుకున్నాడు. ఆయన కళ్ళు, మనస్సు ఆత్రంగా ఆ కాగితాల్లోని అక్షరాలను అవలోకిస్తున్నాయి.

"నాన్నా!

గుండెలు బాదుకుంటూ మీరు వస్తారని తెలుసు. మీరు వచ్చేటప్పటికి మా ఇద్దరిలో ఏ ఒక్కరూ ప్రాణాలతో ఉండమని తెలిసి ఉత్తరం రాస్తున్నాను.... బాధపడకండి!

నాన్నా... ఇది మీరు ఊహించని పరిణామం. అనుకోని మానవ నైజం. సవ్యంగా పోతున్న మా సంసార నౌక ఇంత హఠాత్తుగా... ఏ తుఫాను లేకుండా నడి సముద్రంలో ఎందుకు మునిగిపోయిందని కదూ మీరు దుఃఖిస్తున్నారు? వద్దు నాన్నా, వద్దు, తుఫాను నా జీవితంలో ఎప్పుడో ప్రవేశించింది. అది నన్ను అంతర్గతంగా కుదిపి కుదిపి మనసును, శరీరాన్ని అతలాకుతలం చేసింది. కాని నేను వెర్రిదాన్ని... కనుక్కునే శక్తి నాకు అప్పట్లో లేకపోయింది.

మీ అల్లుడు బాబూరావుకు ఇక్కడికి వచ్చినప్పటి నుండి డబ్బు పిచ్చి ఎక్కువయింది. నా మీద అభిమానం. ఆసక్తి తక్కువయ్యాయి. ఎప్పుడూ ఏదో అసంతృప్తితో బాధపడటం. నా మీద విరుచుకు పడటం. ఆయన కోపం, ఎందుకో ఒక పట్టాన నాకు అర్థమయ్యేది కాదు. నిన్ను అనవసరంగా కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని తప్పటడుగు వేశాను. మీ నాన్న నాకు అప్పనంగా అంటగట్టాడు.... నా కిప్పుడు ముప్పైవేలు కట్నం ఇస్తామని రెండు మూడు సంబంధాలు వస్తున్నాయి అంటూ వాపోయేవాడు. నే నేమనగలను? చిన్నప్పటి నుండి మీ చల్లని నీడలో ఒద్దికగా బ్రతికినదాన్ని నా మనసు తూట్లు పడుతున్నా, ఆయన మనస్తత్వానికి అనుగుణంగా మసలుకునే దాన్ని, తిట్లు తిట్టడం, అసహ్యించుకోవడం, దరిద్రదేవతగా నాకు పేరు పెట్టడం... ఎదిరించి ఎప్పుడైనా జవాబు చెప్తే చేయి చేసుకోవడం! ఇదీ ఆయనలో వచ్చిన మార్పు.

ఎందుకో క్రమంగా ఆయన వైఖరి మళ్లీ మారింది. నేను అదృష్టాన్ని తలచుకున్నాను. ఆయనకు నా మీద మక్కువ ఎక్కువయ్యింది. ఆయన మాటల్లోని నిజాయితీకి, ఆత్మీయతకు నా కళ్ళంట నీళ్ళు తిరగేవి. వసూ! నీవు చాలా నీరసంగా ఉన్నావు అంటూ నాకు వారానికో ఇంజక్షను చేసేవారు. నా ఆరోగ్యం పట్ల ఆయనకనబరిచే శ్రద్ధకు నా అణువణువూ పులకించేది.

ఆరోజు అర్ధరాత్రి మధ్య గదిలో గాఢ నిద్రలో ఉన్నాను. ఎందుకో మెలకువ వచ్చింది. ముందు గదిలోంచి ఎవరివో గుసగుసలు వినబడుతున్నాయి. భయం భయంగా లేచి తలుపు దగ్గరగా నడిచాను. అంతే! నా గుండె బద్దలయిపోతోందా అనిపించింది. కాళ్ళు నేలలోకి కూరుకుపోతున్నట్లయి కళ్ళు తిరిగి రెండడుగులు వెనక్కి వేసి మంచం మీద మళ్ళీ వాలిపోయాను.

ఎంత దారుణం? భగవాన్ ? నేనేం పాపం చేశాను.?

ఓ వారం రోజుల్లోనే - రక్తనాళాలు పగిలిపోయి నేను చచ్చిపోతానట! మూడు నెలలుగా నాకు చేసిన ఇంజక్షన్ల వల్ల మృత్యు దేవత నన్ను మౌనంగా కౌగలించుకో బోతోందట! తరువాత నెలలోనే మీ కార్యక్రమం మీరు చేసుకోవచ్చని... మా ఇంటికి తరచుగా వచ్చే ఆ దంపతులకి నచ్చ చెప్పుతున్నాడు మీ అల్లుడు బాబూరావు. వాళ్ళెవరో కాదు నాన్నా! అతని మేనమామ, మేనమామ భార్య... నాన్నా! నేనేం చేయను? ఎవరితో చెప్పుకోను? నాకు తెలియకుండానే నా చావుకు ముహూర్తం పెట్టాడు నాకు తాళి కట్టిన భర్త! ఎంత కుట్ర? ఎంత కుత్సితం? ఎంతటి క్రూరత్వం! ఎంతటి కర్కశత్వం! ఎంతటి కసాయితనం! ఎంతటి పాశవికత? స్వార్థం, విషపూరితమై కేవలం కట్నం డబ్బు కోసమే మరో కన్నె మెడలో తాలి కట్టాలని నన్ను బలి తీసుకుంటున్నాడు బాబూరావు. నా బ్రతుకు అంతం చేస్తున్నాడు. బాబూరావు...

అతన్ని అమాయకత్వంగా నమ్మి, నా ఆరోగ్యం కోసమే అనుకుని అన్ని ఇంజక్షన్లు చేయించుకున్నాను. కాని ఇప్పడనిపిస్తోంది. నా నరనరాల్లోనూ నరకం లాంటి బాధ! ఈ మూడు నెలలుగా నా శరీరం క్షీణించిపోయి నేను చిక్కిశల్యమయ్యాను. నా రూపం నాకే వికృతమనిపిస్తోంది. అంతా ఆ విషపూరిత ఇంజక్షన్ల ప్రభావమే! నిజం... నాకు చావు తప్పదు... తప్పదు!

నాన్నా!

వారం రోజుల్లో నేను ఈ ప్రపంచం నుంచి వీడ్కోలు తీసుకుంటానని తెలియగానే నాకు భయం కలగలేదు. ఏదో నిర్వికారం, నిశ్చింత! కాని... నేనేం పాపం చేశాను? ఎందుకు నాకీ శిక్ష ఈ మనుషులు....నాగరికత... ప్రకృతి అందాలు, అనుభవాలు, ఆశలు, కలలు, అన్నీ

వదిలి ఎందుకు చనిపోతున్నాను? అన్నిటికీ బాబూరావే కారణం. నా బ్రతుకును అంతం చేసే హక్కు అతనికి ఎలా వచ్చింది? అతని భార్యనయినందుకేగా? ఎన్ని తియ్యటి మాటలు చెప్పాడు? ఎంత ప్రేమ నటించాడు? ఆ నవ్వులో పలకరింపులో ఎంతటి మోసం! దగా! కుట్ర! నా జీవితాన్ని అన్యాయంగా బలి తీసుకుంటోన్న ఆ నీచుడ్ని నే నేమీ చేయలేనా? నేను పోయిన తరువాత ఆ దుర్మార్గుడు మరో కన్నెకు ఇంతటి దారుణం తలపెట్టడని నమ్మకం ఏమిటి?ఏం చెయ్యాలి?

మరునాడు ఉదయం మామూలుగా తెల్లవారింది. అతను మామూలుగానే నన్ను పలకరిచాడు. యథావిధిగా ఆస్పత్రికి వెళ్ళిపోయాడు. నేను వీధిలో పడ్డాను. బజారులో దొడ్లో మొక్కలకని ఘాటైన చీడపురుగు మందు ఒకటి తీసుకున్నాను. అతను మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వచ్చాడు. ఆవు రావురుమంటూ భోజనం చేశాడు. భోజనం చేస్తూనే కడుపు చేత్తోపట్టుకుని పక్కకు వాలిపోయాడు. అప్పుడు చెప్పాను- అన్నంలో కూరల్లో మజ్జిగలో మందు కలిపానని, బాబూరావు గుడ్లు తేలేసాడు. నేను తలుపులన్నీ బిగించాను. అతను విలవిలా కొట్టుకున్నాడు. కేకలు పెట్టాడు. నురగలు గక్కుతూ కళ్ళు మూశాడు. నన్ను అంతం చేసే ప్రయత్నంలో నాకంటే ముందుగా అతనే అంతమయ్యాడు.

నాన్నా!

ఆడదాన్ని అంగడి బొమ్మగా కొనుక్కొంటున్నారు. ఆటవస్తువుగా చేసి ఆడుకుంటున్నారు. కట్నాల పేరుతో తెలివిగా హత్యలు చేస్తున్నారు. అమానుషంగా సజీవదహనాలే కానిస్తున్నారు. వీటికి అంతం పలకాలి. నా కథ ఒక దృష్టాంతం కావాలి! నేను చేసింది తప్పో ఒప్పో ! నా కథ మీరు అందరితోనూ చెప్పండి. అల్లుడు బాబూరావు చరిత్ర కూడా ! నాన్నా ఇక నాకూ బ్రతకాలని లేదు. ఎందుకో ఆత్మ చాలా సంతృప్తిగా ఉంది. వారం రోజుల్లో రక్తనాళాలు పగిలి నేను చనిపోవడం ఎలాగూ ఖాయం! మృత్యు ముఖంలో ఉన్న నేను. నాకు తాళికట్టిన బాబూరావుతోనే తనువు చాలిస్తున్నాను. అందుకు అతను తిన్న అన్నమే నేనూ తింటున్నాను...

చివరిగా ఒక కోరిక పూర్వం ఎప్పుడో భర్త చనిపోతే భార్యకు ఇష్టం లేక పోయినా ఆమెను బలవంతంగా చితిపైకి తోసి సతీసహగమనం చేయించేవారట... అది దురాచారం! ఇప్పుడు నేను చనిపోతూ ప్రతీకారంగా నా భర్తను చంపి వెంట తీసుకుపోతున్నాను. దీన్నేమంటారు? పతీ సహగమనమా? భార్యల్ని కట్నం పేరుతో మంటల్లోకి తోసే భర్తల్ని... అవే మంటల్లోకి వాళ్ళనీ తోస్తేనే సరియైన శిక్ష అవుతుందని నాకు అనిపిస్తోంది. ఇది సదాచారం అవుతుందని నేను గట్టిగా నమ్ముతున్నాను! నాన్నా! మరిచిపోకండి. అతడ్ని కూడా నా చితిమీదకు చేర్చండేం! నా కోసం కన్నీరు కార్చవద్దు. నా ఆత్మకు ఎంతో శాంతిగా ఉంది. శెలవు. మీ ముద్దుల కూతురు - వసుంధర!

ఉత్తరం ఆసాంతం చదివిన మాధవయ్య మనస్సు మూగగా ఘూర్ణిల్లింది. అంతులేని క్షోభ... ఆవేదన... అతడ్ని నిలువునా ముంచెత్తాయి. అతడి కళ్ళ నుండి రక్తాశ్రువులే ఒలికాయి...

ఆ మర్నాడు విషణ్ణ వదనంతో, శిథిల హృదయంతో వసుంధర కోరిక ప్రకారం... పోలీసులు పోస్టుమార్టమ్ చేయించి అప్పగించిన అల్లుడు కూతురు శవాలకు ఒకే చేతిమీద దహన క్రియలు పూర్తిచేశాడు మాధవయ్య...

❀ ❀ ❀ ❀ ❀ ❀

(ఆంధ్రప్రభ 25.12.85)